ట్యాంకర్‌కు రోజుకు రూ.2వేలు

ట్యాంకర్‌తో పొలానికి నీళ్లు పెడుతున్న ఈ రైతు పేరు కందుల పురుషోత్తంరెడ్డి. సూర్యాపేట జిల్లా మునగాల మండలం నారాయణగూడెంలో రెండు బోర్లతో మూడెకరాల్లో వేసిన ఈ రైతు వరి చేను పొట్టకొచ్చింది. కండ్లెదుట ఎండుతున్న పొలాన్ని చూడలేక రోజుకు రూ. 2 వేల చొప్పున ట్యాంకర్ మాట్లాడిండు. 10 రోజులుగా రెండు కిలోమీటర్ల దూరం నుంచి 8ట్యాంకర్ల నీటిని అందిస్తున్నాడు. ఇప్పటికే ఎకరానికి రూ.32 వేల పెట్టుబడి పెట్టిన రైతుకు నీటి కోసం మరో రూ.20 వేలు అదనంగా ఖర్చు అవుతుంది.

- మునగాల, మార్చి 4

30 వేలతో 3 కి.మీ. పైపు

3 కిలోమీటర్ల దూరం నుంచి పైపులైన్ పరిచి పంటకు నీళ్లు అందిస్తున్న ఈ రైతు పేరు నేనావత్ హన్మానాయక్. వీళ్లది సాగర్ ఆయకట్టు పరిధిలోని నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కుంకుడుచెట్టు ఆవాస గ్రామమైన పానుగోతుతండా. ఆగి ఆగి పోస్తున్న మూడు బోర్లతో 3 ఎకరాల్లో వరిని కాపాడుకోలేక తుంగపాడు వాగు నుంచి 3 కి.మీ పొడవునా పైప్‌లైన్ వేసి నీళ్లు తీసుకొస్తున్నారు. కేవలం పట్టా పైపు కొనడానికే రూ.30 వేలకు పైగా ఖర్చు అయిందని వాపోయాడు. - త్రిపురారం, మార్చి 4

కాల్వలో ఇంకిన నీళ్లు.. కన్నీళ్లై పారుతున్నయి!

పదేండ్ల తర్వాత మళ్లీ పాతరోజులు .. సాగునీటి కోసం కర్షకుల తిప్పలు

ఎండిన పొలానికి ట్యాంకర్లతో నీరు • కిలోమీటర్ల మేర పరుచుకున్న పైపులు

పశువుల మేతగా పచ్చని పొలాలు • కడుపుమండి రోడ్డెక్కుతున్న రైతులు

(నమస్తే తెలంగాణ, న్యూస్‌నెట్‌వర్క్)

పదేండ్ల తరువాత మళ్లీ పాతరోజులు వచ్చాయి. సాగునీటికి గడ్డుకాలం వచ్చింది. గలగల పారాల్సిన కాల్వలన్నీ నెర్రెలు పారాయి. కాల్వల్లో ఇంకిన నీళ్లన్నీ కర్షకుల కన్నీళ్లై పారుతున్నాయి. ఎండిన పొలాన్ని చూసి రైతుల గుండెలు మండుతున్నాయి. పచ్చని పొలాలు పశువుల మేతగా మారుతుంటే.. సకాలంలో నీళ్లిచ్చి ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసిన వేళ.. కడుపుమండిన అన్నదాతలు సాగునీటి కోసం రోడ్డెక్కుతున్నారు. పొట్టకొచ్చిన పంటను కాపాడుకునేందుకు తీరొక్క తిప్పలు పడుతున్నారు. కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు తీసుకొస్తూ అపర భగీరథులుగా మారుతున్నరు. ప్రాజెక్టుల నుంచి నీళ్లు విడుదల చేయాలని అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. అయినా పట్టని అధికారులు, పాలకులు నిస్సహాయ స్థితిలో ఉండగా, పంటను కాపాడుకోవడానికి రైతులు అరిగోస పడుతున్నారు. ఎస్సారెస్పీ 16 డీబీఏ కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందించాలని కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలోని వంతడుపుల, నగరం, ఆకనపల్లి గ్రామాల రైతులు సోమవారం తహసీల్దార్ రాణికి వినతిపత్రం అందజేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఎల్లాయిపల్లి రైతులు రామునిపట్ల రాజీవ్ రహదారిపై సోమవారం ధర్నా నిర్వహించారు. అలాగే హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకూర్తి, పసరగొండ గ్రామాల రైతులు ల్యాదెళ్ల, ఆరెపల్లి ఎస్సారెస్పీ డీబీఎం-31 వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పది రోజులుగా సాగునీరు రావడం లేదని ఎస్సారెస్పీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అధికారులే చెప్పాలని, పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు సంజీవయ్య, దుబాసి రవి, సముద్రాల రాజు, సముద్రాల మధు ఆవేదన వ్యక్తం చేశారు.

సిద్దిపేట జిల్లా రామునిపట్ల రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న ఎల్లాయిపల్లి రైతులు

పంట ఎండుతుంటే ప్రాణం పోతుంది

మాకు మూడెకరాల పొలం ఉంది. పదేండ్లుగా పైర్లు పచ్చగా కళకళలాడుతుండె. పొలానికి కాలువ నీళ్లు వస్తుండె. డ్యాంకు నీళ్లు రాకపోవడంతో ఆ నీళ్లు ఆగిపాయె. ఉన్న రెండు బోర్లలో కూడ నీళ్లు తగ్గినయి. రూ.వేల పెట్టుబడులు పెట్టినం. కండ్లెదుట పంటలు ఎండుతుంటే ప్రాణం పోతుంది.

- మహాదేవి, మహిళా రైతు, పెంచికలపాడు, జోగులాంబ గద్వాల జిల్లా

చెరువులు నింపితేనే పంటలు

నాకు ఎకరంన్నర భూమి ఉన్నది. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. కాళేశ్వరం నీళ్లు బంద్ కావడంతో బావులు అడుగంటిపోయాయి. రూ.35 వేలు ఖర్చు పెట్టి బావిలో పూడిక తీయించిన. రూ.60 వేలు ఖర్చు చేసి సైడ్‌బోర్లు వేయించిన. చెరువులను నింపితే పంటలు పండే అవకాశం ఉన్నది.

- కాశవేణి మల్లేశం, రైతు, గుమ్లాపూర్, కరీంనగర్ జిల్లా

ఎస్సారెస్పీ డీబీఎం-31 వద్ద సాగునీరు అందించాలని ఆందోళన చేస్తున్న రైతులు

కేశరాజుపల్లిలో ఎండిన పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఆ పార్టీ నేతలు

కరువు నష్టం అంచనా వేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ, మార్చి 4 : ఎండుతున్న పంటలను మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అధికారులు కరువుపై పంట నష్టపరిహారం అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి కోరారు. నల్లగొండ పట్టణ సమీపంలోని కేశరాజు పల్లిలో నీరు లేక ఎండుతున్న వరి పొలాలకు ట్యాంకర్ ద్వారా రైతులు నీళ్లు పెడుతున్న విషయం నమస్తే తెలంగాణలో ప్రచురితం కాగా వారు అక్కడికి వెళ్లి వరి పొలాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ దాసరి హరిచందనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హశం, పట్టణ కార్యదర్శి ఎండీ సలీం, జిల్లా కమిటీ సభ్యులు వీరపల్లి వెంకటేశ్వర్లు, పాలడుగు నాగార్జున, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు

- బీఆర్ఎస్‌ను బద్నాం చేసేందుకు కుట్రలు
- ఎన్‌డీఎస్ఏ కమిటీ ఏర్పాటుతో బట్టబయలు
- మేడిగడ్డపై నాడు వారం రోజుల్లోనే రిపోర్టు
- కమిటీ వేసేందుకు ఆసక్తి చూపని వైనం
- నేడు నిపుణుల కమిటీకి 4 నెలల గడువు
- రేవంత్ ప్రభుత్వానికి మోదీ సర్కారు సాయం
- మేడిగడ్డకు ఇప్పట్లో ఎలాంటి రిపేర్లు లేనట్టే

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్‌ను బద్నాం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కుని కుట్రలు పన్నుతున్నాయి. మేడిగడ్డ ఘటనపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) స్పందిస్తున్న తీరును, కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు నిపుణుల కమిటీని వేయడాన్ని చూస్తుంటే ఈ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని మరోసారి స్పష్టమవుతున్నది.

నాడు వారం రోజుల్లోనే రిపోర్టు

నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం.. దేశంలో ఏ డ్యామ్ ప్రమాదం వాటిల్లినా వెంటనే ఎన్‌డీఎస్ఏ తనకుతానుగా స్పందించాల్సి ఉంటుంది. గతేడాది అక్టోబర్ 21న మేడగడ్డ బరాజ్‌లోని పిల్లర్ కుంగబాటుకు గురైన వెంటనే నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం ఎన్‌డీఎస్ఏ ఆగమేఘాల మీద కమిటీని వేసింది. ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్‌జైన్‌తో పాటు కే శర్మ, ఆర్ తంగమాణి, రాహుల్ కే సింగ్, దేవేందర్‌రావు, కేజీబీవో నామినేట్ చేసిన మరో ఇద్దరు సభ్యులతో కూడిన ఆ కమిటీ అక్టోబర్ 23న రాష్ట్రానికి విచ్చేసింది. 24న మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించింది. 25న తెలంగాణ ఇరిగేషన్ ఉన్నతాధికారులు, ప్రాజెక్టు అధికారులు, బరాజ్ నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై సాంకేతిక అంశాలకు సంబంధించిన అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నది. పూర్తి సమాచారాన్ని రాష్ట్ర అధికారులు ఇవ్వకముందే అక్టోబర్ 29 నాటికే మేడిగడ్డ బరాజ్ ఘటనపై ప్రాథమిక నివేదికను వెలువరించింది. దాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా నేరుగా పత్రికలకు విడుదల చేసింది. ఎలాంటి పరీక్షలు, పరిశోధనలు చేయకుండా కేవలం క్షేత్రస్థాయి సందర్శనకే పరిమితమైన ఎన్‌డీఎస్ఏ.. బరాజ్ కుంగుబాటుకు డిజైన్, నాణ్యత లోపాలే కారణమని నిర్ధారించింది.

నేడు 4 నెలల గడువు

స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అవకాశం, అధికారం ఎన్‌డీఎస్ఏకి ఉన్నప్పటికీ మేడిగడ్డ ఘటనపై గత 4 నెలల్లో ఎన్నడూ స్పందించలేదు. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బరాజ్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి లోపాలను గుర్తించాలని, తదుపరి చేపట్టాల్సిన పునరుద్ధరణ పనులపై తగిన సిఫారసులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గత నెల 13న కేంద్ర జల్‌శక్తి శాఖకు విజ్ఞప్తి చేసింది. దీంతో మళ్లీ మేలుకున్న ఎన్‌డీఎస్ఏ.. మేడిగడ్డ ఘటనపై అధ్యాయనానికి ఇటీవల సీడబ్ల్యూసీ, గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కూడిన నిపుణుల కమిటీని నియమించింది. కానీ, నాడు కేవలం వారం రోజుల్లోనే రిపోర్టు ఇచ్చిన ఎన్‌డీఎస్ఏని ఇప్పుడు 4 నెలల్లో నివేదిక ఇవ్వాలని కేంద్రం ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. మేడిగడ్డతోపాటు, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పూర్తిస్థాయిలో ఇన్వెస్టిగేషన్ చేసేందుకు అధిక సమయం పట్టినప్పటికీ ఈ లోగా చేపట్టాల్సిన తాత్కాలిక రక్షణ చర్యలను వెంటనే సిఫారసు చేయాలని కేంద్రం ఎన్‌డీఎస్ఏ కమిటీకి స్పష్టం చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికే 4 నెలల సమయం వృథా కావడంతో ఇక మిగిలి ఉన్నది 3 నెలలే. ఎందుకంటే జూన్ మొదటి వారం నుంచి ప్రాణహితలో వరద ప్రవాహాలు ప్రారంభమవుతాయి. బరాజ్ రక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టాలన్నా కూడా ఈ లోపే సాధ్యమవుతుంది. ఆ తర్వాత డిసెంబర్ వరకు గోదావరిలో ఎలాంటి పనులు చేపట్టడం సాధ్యం కాదు. దీన్ని కేంద్రం విస్మరించి 4 నెలల్లోగా నివేదిక ఇవ్వాలని కమిటీకి సిఫారసు చేయడంతో అప్పటివరకు అక్కడ పునరుద్ధరణ చర్యలతో పాటు కనీస రక్షణ పనులను కూడా చేపట్టేందుకు వీల్లేకుండా పోయింది.

మళ్లీ డిసెంబర్ వరకు లేనట్టే..

ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీకి కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలను చూస్తుంటే మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణ పనులు డిసెంబర్ చివరి వరకూ ప్రారంభమయ్యే అవకాశం లేదని స్పష్టమవుతున్నది. ఎన్‌డీఎస్ఏ కమిటీ తన నివేదికను సమర్పించే వరకూ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నివారణ, రక్షణ చర్యలు చేపట్టే అవకాశం కనిపించడం లేదు. జూన్ మొదటి వారం నుంచి గోదావరిలో వరద ప్రవాహాలు ప్రారంభమవుతాయి. మేడిగడ్డ వద్ద దాదాపు 5 వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నది. దీనికి వరద ప్రవాహాలు కూడా తోడైతే డిసెంబర్ వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టడం సాధ్యం కాదని ఇంజినీర్లే తేల్చిచెప్తున్నారు. దీంతో ప్రస్తుతం 7వ బ్లాక్‌కే పరిమితమైన సమస్యలు వరద వల్ల ఇతర బ్లాక్‌లకు విస్తరించడం ఖాయమని, తద్వారా మొత్తం బరాజ్‌కు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి ఎన్‌డీఎస్ఏతో చర్చించాలని, 7వ బ్లాక్‌లో తలెత్తిన సమస్యలు ఇతర బ్లాక్‌లకు విస్తరించకుండా వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్ఎస్‌నే బద్నాం చేయడమే లక్ష్యం

బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు బీఆర్ఎస్‌ను బద్నాం చేయడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. తాజాగా ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ ఏర్పాటుతో ఆ రెండు పార్టీల కుట్ర మరోసారి బట్టబయలైందని రాజకీయ విశ్లేషకులు తేల్చిపారేస్తున్నారు. అక్టోబర్ 21న మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్ కుంగిన వెంటనే నాటి బీఆర్ఎస్ సర్కార్‌ను బద్నాం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రాజకీయ కోణంలోనే ఎన్‌డీఎస్ఏ బృందాన్ని రాష్ట్రానికి పంపి వారం రోజుల్లోనే అసంబద్ధ వివరాలతో ప్రాథమిక నివేదికను విడుదల చేయించిందని, ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారాన్ని చేపట్టాక కేంద్రం ఇప్పటివరకు స్పందించలేదని గుర్తుచేస్తున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు సైతం శ్వేతపత్రం, మంత్రుల పర్యటన అంటూ బీఆర్ఎస్‌ను బద్నాం చేసేందుకు ప్రయత్నించిందే తప్ప మేడిగడ్డ ఘటనపై దర్యాప్తు చేపట్టాలని ఎన్‌డీఎస్ఏకి లేఖ రాయలేదు. ప్రస్తుతం పంటలు ఎండిపోతుండటంపై రైతులు కన్నెర్ర చేస్తుండటంతో మేడిగడ్డ బరాజ్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీటిని లిఫ్ట్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నది. కాంగ్రెస్ సర్కారు తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఎన్‌డీఎస్ఏకు లేఖ రాసింది. మరోవైపు రేవంత్ సర్కారును గట్టెక్కించేందుకు కేంద్రం ఇప్పుడు కమిటీని వేసి నివేదికకు 4 నాలుగు నెలల గడువు ఇచ్చింది. దీనిని సాకుగా చూపి మరమ్మతులు చేపట్టకుండా కాంగ్రెస్ సర్కారు తప్పించుకునేందుకు కేంద్రం సహకరిస్తున్నది.

ఇంతకాలం ఏం చేశారు?

ప్రాజెక్టు నిర్మాణం 2016లో ప్రారంభమైతే అక్రమాలపై 2024లో పిటిషన్ వేస్తారా?

కాళేశ్వరంపై పిటిషన్ మీద హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం 2016లో ప్రారంభిస్తే 2024లో హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేస్తారా? ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగితే ఇంతకాలం ఏం చేస్తున్నారు? అంటూ రాష్ట్ర హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. తాము ప్రశ్నలు సంధించడం మొదలుపెడితే జవాబు చెప్పలేరని ఘాటుగా వ్యాఖ్యానించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీసు స్టేషన్‌లో మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుపై నమోదైన కేసును సీబీఐకి బదలాయించాలని,ఈ ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు జీ నిరంజన్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యానికి నంబర్ కేటాయించేందుకు హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్‌ను ఉద్దేశించి ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీనిపై పిటిషనర్ తరపు న్యాయవాది టీ నరేందర్‌రావు స్పందిస్తూ అక్రమాలు జరిగాయని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు, ఇదేం పబ్లిసిటీ పిటిషన్ కాదు అని వ్యాఖ్యానించింది.

ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ, ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిందని, ప్రాథమిక నివేదిక ఆధారంగా ఇప్పటికే కొంతమంది అధికారులను పదవుల నుంచి తొలగించిందని చెప్పారు. తుది నివేదిక అందిన తర్వాత పూర్తిస్థాయిలో చర్యలు ఉంటాయని తెలిపారు. ఎంక్వయిరీ యాక్ట్ ప్రకారం జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నదని చెప్పారు. 2023 అక్టోబరు 24, 25 తేదీల్లో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ప్రాజెక్టును సందర్శించి ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించిందని చెప్పారు. మేడిగడ్డ అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్, నిర్మాణం, ఆపరేషన్స్ నిర్వహణపై అధ్యయనం చేయాలని ప్రభుత్వం ఫిబ్రవరి 13న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీకి లేఖ రాసినట్లు వివరించారు. ఈ మేరకు అరుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయని చెప్పారు. అడ్వకేట్ జనరల్ రాతపూర్వకంగా వివరాలను పరిశీలించిన హైకోర్టు.. ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టినందున తదుపరి విచారణను నాలుగు నెలలకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.

కాళేశ్వరంపై నేడు సమీక్ష

హైదరాబాద్, మార్చి4 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్ మంగళవారం సమీక్షించనున్నారు. జలసౌధలో జరిగే ఈ సమీక్షకు సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టు ప్యాకేజీల వారీగా పనుల పురోగతి, నిధుల వివరాలు, అందుబాటులోకి వచ్చిన ఆయకట్టు, తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించనున్నారు.

తాగునీటి సరఫరాపై 7 నుంచి స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : వేసవి నేపథ్యంలో ఈ నెల 7 నుంచి 15 వరకు గ్రామీణ మంచినీటి సరఫరాపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ గ్రామీణా మంచినీటి సరఫరా ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. సోమవారం మిషన్ భగీరథ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ మౌలిక వసతుల మరమ్మతు, వార్షిక నిర్వహణ పనులపై రోజువారి నివేదిక సమర్పించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ల పర్యవేక్షణలో జిల్లా పంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ కార్యనిర్వహక ఇంజినీర్లు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పంచాయతీరాజ్, గామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ చీఫ్, కృపాకర్ రెడ్డి, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేఆర్ఎంబీ మెంబర్‌గా శంకువ

హైదరాబాద్, మార్చి4 (నమస్తే తెలంగాణ): కృష్ణా నదీ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) మెంబర్ అజయ్‌గుప్తా స్థానంలో ఆర్ఎన్ శంకువ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర జల శక్తిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అజయ్ గుప్తాను చండీఘడ్ ఐబీవో సీఈగా నియమించింది.

విద్యుత్తు వైరు తెగిపడి ముగ్గురి మృతి

వరంగల్ జిల్లా మోత్యాతండాలో విషాదం

పర్వతగిరి, మార్చి 4: విద్యుత్తు తీగలు తెగిపడి ముగ్గురు మృత్యువాతపడగా.. తీవ్రంగా గాయపడిన ఓ బాలుడు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మోత్యాతండాలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. మోత్యాతండా ప్రజలు సంతోషంగా దుర్గమ్మ పండుగ జరుపుకుంటున్నారు. సోమవారం బోనాలు కూడా సమర్పించారు. మంగళవారం పండుగ కోసం బంధువులను పిలుచుకున్నారు. ఈ సందర్భంగా తండావాసులు తమ ఇండ్ల ముందు టెంట్లు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో రాత్రి 8 గంటల సమయంలో తండాకు చెందిన భూక్యా రవి(30) టెంట్ వేస్తుండగా స్ట్రీట్ లైట్ విద్యుత్తు తీగ తెగి అతడి ఇంటి ముందు పడింది. ఆ సమయంలో రవితోపాటు అక్కడే ఉన్న రవిబావ రాయపర్తి మండలం గట్టికల్‌కు చెందిన గుగులోత్ దేవేందర్(32), టెంట్ వేసేందుకు వచ్చిన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం జమస్తాన్‌పురానికి చెందిన సునీల్(20)లకు విద్యుత్తు షాక్ తగిలింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దేవేందర్, సునీల్ అక్కడికక్కడే మృతిచెందగా.. దవాఖానకు తీసుకెళ్తుండగా రవి మార్గమధ్యంలో మృతిచెందాడు. కాగా.. రవి కుమారుడు జస్వంత్(4) తీవ్ర గాయాలతో ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదంతో తండాలో తీవ్ర విషాదం నెలకొంది. విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఓవర్‌లోడ్‌తో తీగలు తెగిపడ్డాయని, గతంలో ఓవర్‌లోడ్ విషయమై అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భూక్యా రవి (ఫైల్)

గుగులోత్ దేవేందర్ (ఫైల్)

సునీల్ (ఫైల్)